## క్లుప్తంగా

### అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

**చింతకొమ్మదిన్నె :** బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలతో, పూలమాలలతో అలంకరించారు. వచ్చిన భక్తులకు ఆలయ కార్య నిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి అన్న ఏర్పాట్లను చేశారు. భక్తులు కానుకలను అమ్మవారికి సమర్పించారు.

### రాత్రివేళ పోలీసుల పెట్రోలింగ్



ముద్దనూరులో రాత్రివేళ తనిఖీలో సీఐ, ఎస్ఐలు

**ముద్దనూరు :** మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత చర్యగా రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు సీఐ దస్తగిరి తెలిపారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జమ్మలమడుగు సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులు, సిబ్బంది ముద్దనూరులో పెట్రోలింగ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

### 3 నుంచి పొలం పిలుస్తోంది

**ముద్దనూరు :** మండల వ్యాప్తంగా ఈనెల 3వ తేదీ నుంచి పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి ఆదివారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. వారంలో ప్రతి మంగళ, బుధవారం రోజున, రోజుకు రెండు గ్రామాల చొప్పున ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏవో తెలిపారు. మొదటగా 3వ తేదీన ఉదయం కొత్తపల్లె, మధ్యాహ్నం తిమ్మాపురం గ్రామాల్లో, 4వ తేదీన కొసినేపల్లె, రాజులగురువాయిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

# కడప నాపరాయికి కష్టాలు..

- గ్రానైట్, టైల్స్‌తో తగ్గిన వ్యాపారాలు
- మూత పడే దశకు పరిశ్రమలు
- రోడ్డున పడుతున్న కార్మికులు
- అయోమయంలో యజమానులు



పాలీష్‌కు సిద్ధంగా ఉన్న నాపరాళ్లు



నాపరాళ్లను బయటకు తీసే గని

**ఎర్రగుంట్ల :** జిల్లాలోని పేరెన్నికగన్న నాపరాయి పరిశ్రమకు గడ్డుకాలం దాపురించింది. ఒకప్పుడు దేశవిదేశాలలో ఈ రాయికి మంచి డిమాండ్ ఉండేది. వీటి యజమానులకు, ఆ పరిశ్రమపై ఆధారపడిన కూలీలకు ఉపాధి పుష్కలంగా ఉండేది. కాలక్రమేణ ఇతర ప్రాంతాల నుంచి గ్రానైట్, టైల్స్ ఆధునిక డిజైన్లతో రావడం, వాటి వినియోగం పెరగడంతో నాపరాయి పరిశ్రమలు మూత దిశగా ఉన్నాయి. ఎర్రగుంట్ల మండలంలోని నిడుజివ్వి, పోట్లదుర్తి గ్రామాల్లో నాపరాయి గనులు ఉన్నాయి. పాలీష్‌మిషన్‌లు ఎర్రగుంట్ల, చిలంకూరు గ్రామాలలో అధికంగా ఉన్నాయి.

రాయలసీమలో ఒకప్పుడు పెద్ద సంఖ్యలో కూలీలు నాపరాయి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందేవారు. ఎర్రగుంట్లలో సుమారు ఈ పరిశ్రమలు 200 దాక ఉండేవి. వీటిపై ఆధారపడి సుమారు 20 వేలకు పైగానే కూలీలు ఉపాధి పొందేవారు. ఎర్రగుంట్ల నాపరాయి వ్యాపారం ఆరు దశాబ్దలుగా డిల్లీ నుంచి గల్లీ వరకు మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నట్టు కొనసాగేది. మొదట్లో రాళ్లను చేత్తో తొలగించి మొలలు ద్వారా రాళ్లను చదరపు సైజులు తయారు చేసేవారు. నాపరాయి పరిశ్రమకు గనులు నుంచి ఎద్దుల బండ్లపై చేర్చేవారు. తర్వాత కాలక్రమేణ లారీలు, ట్రాక్టర్లు రావడంతో వాటి ద్వారా తరలించేవారు. ఆటు తర్వాత కొత్త మిషన్ వచ్చి గనులలో రాళ్లను సులభతరంగా తీసి పరిశ్రమలకు చేర్చేవారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు, కొల్‌కత్తా, ముంబై, డిల్లీ, తమిళనాడు, రాష్ట్రాలతో పాటు న్యూజిల్యాండ్, సింగపూర్ తదితర దేశాలకు ఎగుమతి చేసేవారు. గతంలో నిత్యం నాపరాయి లోడింగ్, అన్‌లోడింగ్ వ్యాపారాలతో ఉండే ఈ పరిశ్రమ యజమానులు బిజీగా ఉండేవారు. ఇంతటి ప్రాదాన్యత గల నాపరాయి పరిశ్రమకు ప్రస్తుతం గడ్డుకాలం వచ్చింది. చాల పరిశ్రమలు మూత పడ్డాయి. గ్రానైట్, టైల్స్‌తో పాటు అత్యుత్తమ డిజైన్లు రావడంతో పరిశ్రమ దెబ్బతింది.

#### ఖర్చులు అధికంగా వస్తున్నాయి



నాపరాయి పరిశ్రమతో చాలా మంది ఉపాధి పొందుతున్నారు. కానీ పరిశ్రమ యజమానులు మాత్రం నష్టాల్లో కూరుకుపోతున్నారు. వారం వచ్చిందంటే చాలు కూలీలకు డబ్బులు ఇవ్వాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ఖర్చులు అధికంగా వస్తున్నాయి దాని లాభాలు మాత్రం శూన్యం.

– చీపాటి వెంకటప్రసాద్‌రెడ్డి, నాపరాయి పరిశ్రమ యజమాని, ఎర్రగుంట్ల.

#### వ్యాపారాలు పూర్తిగా తగ్గిపోయాయి



గతంలో ఇతర రాష్ట్రాలలో నాపరాయికి డిమాండ్ ఉండేది. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయి. ట్రేడింగ్ చేయాలంటేనే భయం పుడుతుంది. ఎగుమతి చేసిన రాళ్ల డబ్బుల కోసం ఏజెంట్ల వద్దకు పోయి బతిమలాడాల్సిన పరిస్థితి ఉంది. రాళ్లకు డిమాండ్ తగ్గిపోవడంతో వ్యాపారాలు పడిపోయాయి.

– మస్తాన్, నాపరాయి పరిశ్రమ ట్రేడర్, ఎర్రగుంట్ల

#### కూలీలు ఇబ్బందులు పడుతున్నారు



నాపరాయి పరిశ్రమను నమ్ముకుని చాలా మంది కూలీలు ఉన్నారు. అయితే పరిశ్రమ నష్టాలలో పడటంతో పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు నాపరాయి పరిశ్రమ అంటే కడప గుర్తుకు వచ్చేది. ఇప్పుడు వ్యాపారాలు లేక కూలీలకు కూడా డబ్బులు ఇవ్వలేని స్థితిలో యజమానులు ఉన్నారు.

– రాధాకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, ఎర్రగుంట్ల

## సేవా దృక్పథం అలవరచుకోవాలి

**సింహాద్రిపురం :** మండలంలో కసనూరు గ్రామానికి చెందిన బోనాల హరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. మృతుని కుటుంబానికి పులివెందుల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్, అవుట్ డోర్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ ఫొటో కుటుంబ సభ్యులు ఆదివారం మృతిడి భార్య ఉమాదేవికి రూ.50,500ల నగదును అందజేశారు. యూనియన్ సభ్యులు మాట్లాడుతూ యూనియన్‌లో ప్రమాదవశాత్తు ఎవరైనా మృతిచెందినా వారి కుటుంబాలకు యూనియన్ అండగా ఉంటుందన్నారు. అలాగే హరి కుటుంబానికి ప్రభుత్వం కూడా ఆర్థిక సాయం అందించాలని వారు కోరారు.



హరి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న వైఎస్సార్ యూనియన్ నాయకులు

## ‘మానవత’ ఆర్థిక సాయం



ఫాతిమాకు ఆర్థిక సాయం అందిస్తున్న మానవత యూనిట్ సభ్యులు

**ఎర్రగుంట్ల :** పట్టణంలోని రాణివనంకు చెందిన షేక్ ఫాతిమా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.10 వేలు నగదును సోమవారం ఆమెకు అందజేసి మాట్లాడారు. ఫాతిమా మంచంలో నుంచి లేవలేని స్థితిలో ఉందన్నారు. కుటుంబం చాలా పేదరికంలో ఉండటంతో ఆమె ఆరోగ్య ఖర్చుల నిమిత్తం మానవత యూనిట్ తరుపున రూ.5 వేలు, మానవత ప్రతినిధులు గంగాధర్‌రెడ్డి రూ.2 వేలు, మేడా రమేష్ రూ.2 వేలు, రమణారెడ్డి రూ.1000లు కలిపి మొత్తం రూ.10 వేలు నగదు అందజేశామన్నారు. కార్యక్రమంలో మానవత యూనిట్ చైర్మన్ డి.రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అచ్చవెల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అచ్చవెల్లి గంగమ్మ

**పులివెందుల రూరల్ :** మండలంలోని అచ్చవెల్లి గ్రామంలో వెలసిన అచ్చవెల్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మ తల్లి గా అచ్చవెల్లి గంగమ్మ ఎంతో ప్రసి ద్ధి గాంచింది. కర్నూలు, అనంతపు రం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భ క్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

## వైభవంగా జాతర

**చింతకొమ్మదిన్నె :** మండలంలోని అంగడి వీధిలో వెలసిన శ్రీ జగన్మాత ముత్తు తులకాంతమ్మ జాతరను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో ఆలయ కమిటీ సభ్యులు అలంకరించారు. తమిళనాడు వాయిద్య బృందం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.



## గణనాథుడి పూజకు వేలాయె..



విక్రయాలకు సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

**పులివెందుల రూరల్ :** వినాయక చవితి అంటే చాలు చిన్నారులకు, యువతకు, పెద్దలకు ఎనలేని ఉత్సాహం. వివిధ రకాల్లో గణనాథుల విగ్రహాలను ఏర్పాటు చేసి విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. 9 రోజుల పాటు గణనాథునికి రోజుకో పూజతో ప్రత్యేక పూజలు చేసి అందంగా అలంకరిస్తారు. ప్రతీరోజు అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఆనందంగా గడుపుతారు. ఇప్పటికే పులివెందులలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో వినాయక విగ్రహాలను విక్రయించేందుకు వ్యాపారస్తులు వివిధ రకాల ప్రతిమలను సిద్ధంగా ఉంచారు.

**ఆకాశాన్నంటుతున్న ధరలు**

వివిధ రూపాలతో ఆకర్షించే రంగులతో 2 అడుగుల నుంచి 12 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు ఉన్నాయి. సుమారు రూ.3వేల నుంచి రూ.50వేల వరకు ఉన్నాయని వ్యాపారస్తులు చెప్తున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో, ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసే పందిళ్లకు ఎత్తైన విగ్రహాలను అందుబాటులో ఉంచారు.

## ఐకమత్యంతోనే పరిష్కరించుకుందాం



నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన అసోసియేషన్ సభ్యులు

**పులివెందుల :** ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కరించుకుందామని రాష్ట్ర నాయకులు నరసింహులు తెలిపారు. ఆదివారం జయమ్మ కాంప్లెక్స్‌లో పులివెందుల ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ నూతన కార్యాలయంలో ఆయన జెండా ఆవిష్కరణ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎలక్ట్రికల్‌కు సంబంధించి సభ్యులందరు ఐకమత్యంతో కలిసిమెలసి ఉండి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పులివెందుల ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముత్యాలప్ప, అధ్యక్షుడు శుభాను, ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి బాబ్జి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## 4న జ్ఞాపికలు పంపిణీ

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని ఎంపీడీఓ సభా భవనంలో 4వ తేదీ నేత్రదాత కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు పంపిణీ చేయనున్నట్లు స్నేహిత అమృతహస్తం సే వా సమితి అధ్యక్షుడు రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రంల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కో రారు. రామతులసమ్మ నర్సింగ్ హోమ్, ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవీంద్రారెడ్డి సహకారంతో ఈ జ్ఞాపికల పంపిణీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరు పా ల్గొనాలన్నారు.

## నేడు వైఎస్సార్ వర్ధంతి

**పులివెందుల రూరల్ :** మహానేత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని భాకరాపురంలో ఉన్న వైఎస్సార్ ఆడిటోరియంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. రక్తదాన శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**కమలాపురం :** స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచిమరెడ్డి నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారన్నారు. పార్టీ కార్యాలయం ఎదుట ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పిస్తారన్నారు. కార్యకర్తలు, నాయకులు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన తెలిపారు.

## వర్షం వస్తే ఇబ్బందులే



అయ్యగారి వీధిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

**జమ్మలమడుగు :** దొమ్మరనంద్యాల గ్రామంలో వర్షం పడితే గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు తెలుపుతున్నారు. ఆదివారం అయ్యగారి వీధి వర్షంతో జలమయం కావడంతో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కొద్ది పాటి వర్షం వస్తే నీరు ఇళ్ల ముందు నిలబడుతోందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందజేసినా ప్రయోజనం లేదన్నారు. రాబోయే రోజుల్లో కాలువల నిర్మాణం చేపట్టకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు.

# గణేష్ ఉత్సవాలకు పోలీస్ అనుమతి తప్పనిసరి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఎస్‌కే రోషన్

**కమలాపురం :** సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు పోలీసుల నుంచి అనుమతి తప్పని సరిగా తీసుకోవాని సీఐ ఎస్‌కే రోషన్ తెలిపారు. ఆదివారం స్థానికత న కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం, జిల్లా ఎస్ పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సింగిల్ విండో విధానంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు ప్రభు త్వం అనుమతులు సులభతరం చేసిందన్నారు. క మిటీ సభ్యులు 79950 95800 అనే వాట్సప్ నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే అనుసరించాల్సిన మొత్తం ప్రక్రియ కమిటీ సభ్యులకే వస్తుందన్నారు. కమిటీ సభ్యులు గణేష్‌ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్ నందు మంటపం ఏర్పాటుకు సంబంధిత వివరా లు పొందుపరచాల్సి ఉంటుందన్నారు. ఈ దరఖా స్తు సంబంధిత ఎస్‌హెచ్‌ఓకు వెళ్తుందని, ఎస్‌హెచ్ ఓ ఏర్పాట్లను పరిశీలించి సానుకూలంగా ఉంటే క్యూర్ కోడ్‌తో ఉన్న నిరభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. మీసేవలో రుసుము చెల్లించి రశీదును వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే ఎస్‌హెచ్‌ఓ నిరభ్యంతర పత్రం వస్తుందన్నారు. ప్రజలందరూ కలసి మెలసి ప్రశాతం వాతావరణలో వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని సీఐ హెచ్చరించారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

**జమ్మలమడుగు :** వినాయక చవితి సందర్భంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలని సీఐ లింగప్ప తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ విగ్రహాలను నిలబెట్టేవారు స్టేషన్ వద్దకు వచ్చి ప్రత్యేక దరఖాస్తులను పూరించాలన్నారు. మున్సిపాలిటీ, ఫైర్, విద్యుత్, పోలీసు శాఖల అనుమతిని తప్పని సరిగా తీసుకోవాలన్నారు.